GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 227 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | సోమవారం 01-04-2024 | పేజీలు : 4

## సీఎం రేవంత్ ఢిల్లీ టూర్ వాయిదా



**టి మీడియా, మార్చి 31,హైదరాబాద్:** కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం వాయిదా పడింది. రేపు ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ ప్రయాణం ఇవాళ వాయిదా పడింది. తెలంగాణలో ఇంకా నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈరోజు ఎన్నికల కమిటీ సమావేశం జరుగుతుందని ముందుగా ప్రకటించడంతో ఢిల్లీ వెళ్లాలనుకున్నారు. రేపటికి వాయిదా కానీ ఢిల్లీలో ఈరోజు విపక్ష పార్టీలు సేవ్ డెమొక్రసీ పేరుతో ర్యాలీని నిర్వహించడంతో పాటు రాంలీలా మైదానంలో బహిరంగ సభను నిర్వహిస్తుండటంతో సీఈసీ సమావేశం వాయిదా పడింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనను రేపటికి వాయిదా వేసుకున్నారు. వరంగల్, ఖమ్మం, సికింద్రాబాద్, హైదరాబాద్ స్థానాలకు సంబంధించి అభ్యర్థులను కాంగ్రెస్ ఇంకా ప్రకటించాల్సి ఉంది.

### రాజ్యాలు పోయినా...

# రాజ్యాధికారం కోసం వెంపర్లాట







- ఎన్నికల బరిలో రాజ కుటుంబాలు
- మైసూర్ రాజు నుంచి త్రిపుర రాణి వరకు అదే భాట

**టి మీడియా, మార్చి 31,న్యూఢిల్లీ :**

రాజ్యాలు పోయాయి. ప్రజాస్వామ్యం వచ్చింది. రాజులు పోయారు. ప్రజలు ఎన్నుకున్న పాలకులు వచ్చారు. కానీ కొన్ని రాజ కుటుంబాలు మాత్రం రాజ్యాలు పోయినా రాజ్యాధికారాన్ని మాత్రం వదులుకోవడం లేదు. ఒకప్పుడు వారసత్వంగా అధికారాన్ని పొందిన ఆకుటుంబాలు, ఇప్పుడు ప్రజల ఓట్లతో గెలుపొంది పరిమిత సామ్రాజ్యాన్ని పరిపాలించాలని చూస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నో రాజ కుటుంబాలు ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది, పదవులు అనుభవించాయి. ఇప్పుడు కూడా దేశవ్యాప్తంగా అనేక రాజ కుటుంబాలకు చెందిన ప్రముఖులు ఎన్నికల బరిలో నిలిచారు.

ఉత్తరం నుండి దక్షిణం వరకు, తూర్పు నుండి పడమర వరకు 2024 లోక్‌సభ ఎన్నికలలో రాజ కుటుంబాలకు భారతీయ జనతా పార్టీ (%దీభ్రీ%) ఇష్టమైన పార్టీగా మారింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున ఏకంగా 12 రాజ కుటుంబాలు పోటీలో నిలిచాయి. వీరిలో 5 రాజ కుటుంబాలకు చెందినవారు తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేస్తుండగా, మరో 7 రాజ కుటుంబాలు తమ ప్రజాస్వామ్య రాజకీయాలను కొనసాగిస్తూ ఎన్నికల బరిలో నిలిచాయి. కర్ణాటకలోని మైసూర్ రాజు నుంచి త్రిపుర రాజ కుటుంబంలోని రాణి వరకు బీజేపీ విడుదల చేసిన అభ్యర్థుల జాబితాల్లో అనేక మంది చోటు సంపాదించుకున్నారు. దేశ రాజకీయాల్లో రాజకుటుంబాల ఆధిపత్యం కొత్త విషయం కానప్పటికీ, తమ చరిత్ర, కీర్తిని గుర్తించి ఎవరు గౌరవప్రదమైన పదవులు ఇస్తే ఆ పార్టీ వైపు రాజ కుటుంబాలు మొగ్గుచూపుతూ వచ్చాయి. నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్ లేదా ఇతర రాజకీయ పార్టీలను ఇష్టపడ్డ రాజ కుటుంబాలు, మారిన పరిస్థితుల్లో టిక్కెట్ కోసం కమలదళం వెనుక క్యూ కడుతున్నాయి.

### ఎన్నికల బరిలో మైసూరు రాజ కుటుంబం

దక్షిణాదిన మైసూరు రాజ కుటుంబానికి ఎంతో చరిత్ర ఉంది. మార్చి 13న విడుదల చేసిన బీజేపీ అభ్యర్థుల జాబితాలో మైసూర్ లోక్‌సభ స్థానానికి సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ సింహ టిక్కెట్‌ను రద్దు చేసింది. ఆ స్థానంనలో పార్టీ మైసూర్ రాజకుటుంబానికి చెందిన యదువీర్ కృష్ణదత్ చామరాజ వడియార్‌ను రంగంలోకి దించింది. యదువీర్ కంటే ముందు ఆయన తాత శ్రీకంఠదత్త నరసింహరాజ వడియార్ రాజకీయాల్లో ఉన్నారు. కాకపోతే 1999 వరకు మైసూర్ స్థానం నుంచి ఆయన నాలుగుసార్లు కాంగ్రెస్ ఎంపీగా కొనసాగారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొని రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు అదే కుటుంబం నుంచి యదువీర్ కాషాయ జెండా పట్టుకుని బరిలోకి దిగారు.

### త్రిపుర రాణి కీర్తి సింగ్ దేవ్ వర్మ

బీజేపీ విడుదల చేసిన జాబితాలో త్రిపుర తూర్పు లోక్‌సభ స్థానం నుంచి కీర్తి సింగ్ దేవ్ వర్మ పేరును బీజేపీ ప్రకటించింది. అక్కడ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రేవతికి పార్టీ టికెట్ నిరాకరించింది. కీర్తి వర్మ మాణిక్య రాజ కుటుంబానికి చెందిన యువ రాణి. ఆమె తిప్ర మోతా పార్టీ నేత ప్రద్యోత్ దేవ్ వర్మకు సోదరి. తిప్ర మోత పార్టీ ఇటీవల ఎన్డీఏ కూటమిలో చేరి ఇప్పుడు త్రిపుర రాష్ట్ర ప్రభుత్వంలో భాగమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మూడో పేరు మాళవిక కేశరి దేవ్. బీజేపీ ఒడిశాలో మాళవిక కేశరీ దేవ్‌ను బరిలోకి దింపింది. ఆమె కలహండి రాజకుటుంబానికి చెందిన వ్యక్తి. మాళవిక బిజూ జనతా దళ్ మాజీ ఎంపీ అర్కా కేశరి దేవ్ భార్య. 2023లో వీరిద్దరూ బీజేపీలో చేరారు.

### రాజసమంద్ నుంచి మేవార్లు

రాజ కుటుంబాల నుంచి పోటీలో ఉన్నవారిలో 4వ పేరు రాజ్‌సమంద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మహిమా కుమారి విశ్వరాజ్ సింగ్ మేవార్. మేవార్ రాజకుటుంబానికి చెందిన విశ్వరాజ్ సింగ్ భార్య మహిమ. ఈసారి విశ్వరాజ్ సింగ్ రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. నాథ్‌ద్వారా అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. ఇప్పుడు రాజ్‌పుత్‌ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న రాజ్‌సమంద్ స్థానం నుంచి పార్టీ ఆయన భార్య మహిమకు టిక్కెట్ ఇచ్చింది.

### బెంగాల్‌లో రాజమాత అమృత రాయ్

రాజ కుటుంబాలకు చెందిన 5వ అభ్యర్థిగా బెంగాల్‌లో రాజమాత అమృత రాయ్‌ను చూడవచ్చు. పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ లోక్‌సభ స్థానం నుంచి తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మోయిత్రాపై బీజేపీ రాజమాతా అమృతా రాయ్‌ను పోటీకి నిలబెట్టింది. రాయ్ కృష్ణనగర్ రాజకుటుంబానికి చెందిన నేత. ఆ ప్రాంతంలో రాజమాత అని సంబోధిస్తారు.రాజకుటుంబాల నుంచి తొలిసారి బరిలోకి దిగిన ఈ ఐదుగురు అభ్యర్థులే కాకుండా, ఇప్పటికే ఎన్నికల రాజకీయాల్లో ఉన్న కొందరు రాజ కుటుంబాల అభ్యర్థులు ఈసారి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. వీరిలో సతారా, పాటియాలా, గ్వాలియర్, బోలంగిర్, ఝులావర్ రాజ కుటుంబాల వారసులు ఉన్నారు.

### ఛత్రపతి వారసులు

ఛత్రపతి శివాజీ వారసుడు, ప్రస్తుతం బీజేపీ రాజ్యసభ సభ్యులుగా ఉన్న ఉదయరాజే భోసలే ఈసారి సతారా లోక్‌సభ స్థానం నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి సిద్ధపడ్డారు. 2019లో ఉదయ్ భోసలే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (%చీజూ%) టికెట్‌పై గెలిచారు. ఆ తర్వాత బీజేపీలో చేరేందుకు రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ పరిస్థితుల్లో పార్టీ ఆయనను రాజ్యసభకు నామినేట్ చేసింది.

పాటియాలా రాజకుటుంబానికి చెందిన ప్రణీత్ కౌర్

మరోవైపు పాటియాలా మాజీ కాంగ్రెస్ ఎంపీ ప్రణీత్ కౌర్ బీజేపీలో చేరారు. ప్రణీత్ కౌర్ పాటియాలా రాజకుటుంబానికి చెందిన మహిళగానే కాదు, కింగ్ కెప్టెన్ అమరీందర్ సింగ్ భార్య. ఇదిలా ఉంటే గ్వాలియర్ మహారాజు జ్యోతిరాదిత్య సింధియా ఇప్పటికే బీజేపీలో రాజ్యసభ ఎంపీగా, కేంద్రంలో మంత్రిగా ఉన్నారు. జ్యోతిరాదిత్య సింధియా తొలిసారి 'గుణ' లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు.

### పట్నాఘర్-బోలంగీర్ రాజకుటుంబం

ఒడిశాలో పట్నాఘర్-బోలంగీర్ రాజకుటుంబానికి చెందిన బొలంగీర్ సిట్టింగ్ ఎంపీ సంగీతా కుమారి సింగ్ దేవ్‌కు బీజేపీ ఈసారి టిక్కెట్ ఇచ్చింది. అలాగే రాజస్థాన్ ఝులావర్-బరన్ నుంచి మూడుసార్లు ఎంపీగా ఎన్నికైన బీజేపీ నేత దుష్యంత్ సింగ్ మరోసారి ఆ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. సింగ్ ధోల్పూర్ రాజకుటుంబానికి చెందిన వ్యక్తి. ఛత్తీస్‌గఢ్‌లోని షాదోల్ రాజకుటుంబానికి చెందిన హిమాద్రి సింగ్ పేరు కూడా బీజేపీ అభ్యర్థుల జాబితాలో ఉంది. హిమాద్రి సింగ్ 2019లో కూడా బీజేపీ టికెట్‌పై గెలిచారు. ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ రాజ కుటుంబానికి చెందిన రాణి లక్ష్మీ షా పేరు సైతం ఈసారి జాబితాలో చేరింది. మహారాణి మాలా రాజలక్ష్మి షాకు గతంలో కూడా తెహ్రీ గఢ్వాల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఇవ్వగా ఆమె విజయం సాధించారు.

2019లో బీజేపీ నుంచి లోక్‌సభ టిక్కెట్లు పొందిన రాజకుటుంబానికి చెందిన నేతలను పరిశీలిస్తే.. వారిలో అత్యధికులు సంప్రదాయబద్ధంగా ఆ పార్టీతో అనుబంధం ఉన్న నేతలే ఉన్నారు. ఇందులో మొత్తం ఆరుగురు రాజకుటుంబ వారసులు బీజేపీ టిక్కెట్‌పై ఎన్నికల్లో పోటీ చేశారు. ఝులావర్ నుండి దుష్యంత్ సింగ్, బోలంగిర్ నుండి సంగీతా సింగ్ దేవ్, షాడోల్ నుండి హిమాద్రి సింగ్, మణిపూర్ రాజ్ కుమార్ రంజన్ సింగ్, తెహ్రీ గర్వాల్ నుండి మాలా రాజ్యలక్ష్మి షా, జైపూర్ ఘరానాకు చెందిన దియా కుమారి పేర్లు ఉన్నాయి. ఈ ఆరుగురిలో నలుగురు ఈసారి కూడా ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. అయితే రాజ్‌కుమారి గత ఏడాది జరిగిన రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు ఆమె రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారు. మణిపూర్ ఇన్నర్ నుండి గెలిచి కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా ఉన్న రాజ్‌కుమార్ రంజన్ సింగ్‌కు ఈసారి టికెట్ ఇవ్వలేదు.

### పెద్దల సభలో

లోక్‌సభలోనే కాదు.. రాజకుటుంబాలకు చెందిన ముగ్గురు నేతలు బీజేపీ తరఫున ఇప్పటికే రాజ్యసభలో ఉన్నారు. నిజానికి రాజకుటుంబాలకు చెందిన నేతలు ఐదుగురు ఉన్నప్పటికీ, వారిలో ఇద్దరి పదవీకాలం ఈ మధ్యనే పూర్తయింది. వారిలో కొందరు పార్టీ మారి బీజేపీలో చేరగా, మరికొందరు తొలిసారి ఎంపీలు అయ్యారు. ప్రస్తుతం బీజేపీ రాజ్యసభ టీమ్‌లో ముగ్గురు మహారాజులు ఉన్నారు. గ్వాలియర్ మహారాజా జ్యోతిరాదిత్య సింధియాతో పాటు మణిపూర్ రాజు లిషెంబా సనజౌబా ఒకరు. సింధియా కుటుంబానికి భారతీయ జనతా పార్టీ కంటే ముందు ఉన్న జనసంఘ్‌తో కూడా సుదీర్ఘ అనుబంధం ఉంది. మణిపూర్ సనాజౌబాకు రాజకీయాలలో ఎటువంటి అనుభవం లేకపోగా.. బీజేపీ అభ్యర్థనపై నేరుగా పెద్దల సభకు వచ్చారు.రాజ్యసభలోని రాజకుటుంబానికి చెందిన 3వ నేత శివాజీ మహారాజ్ వారసుడు ఉదయ రాజే భోసలే. ఈ మధ్యనే పదవీకాలం పూర్తిచేసుకున్న రాజ కుటుంబీకుల్లో దుంగార్‌పూర్ రాజ కుటుంబానికి చెందిన హర్షవర్ధన్ సింగ్ ఒకరు. ఆయన ప్రముఖ క్రికెట్ అడ్మినిస్ట్రేటర్ రాజ్ సింగ్ దుంగార్పూర్ మేనల్లుడు. మరొకరు కొల్హాపూర్‌లో శివాజీ మహారాజ్ వారసుడు శంభాజీ రాజే. మరాఠా ఉద్యమానికి ముఖంగా మారిన శంభాజీ తొలిసారిగా రాజ్యసభ సభ్యుడు అయ్యారు. ఈ ఇద్దరి పదవీకాలం పూర్తి కావడంతో రాజ్యసభలో మిగిలిన రాజకుటుంబీకుల్లో జ్యోతిరాదిత్య సింధియా, లిషెంబా సనజౌబా, ఉదయరాజె భోసలే మిగిలారు. వీరిలో మణిపూర్ రాజకుటుంబీకులు సనజౌబా మినహా మిగతా ఇద్దరు లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచారు కాబట్టి అక్కడ గెలిస్తే ఇక్కడ పదవిని వదులుకోవాల్సి వస్తుంది. అప్పుడు సనజౌబా ఒక్కరే రాజ్యసభలో రాజకుటుంబీకుడిగా మిగిలిపోతారు.



- మ్యాచ్ ఫిక్సింగ్‌కు యత్నిస్తున్న ప్రధాని : రాహుల్ గాంధీ
- ఐదు డిమాండ్లను వినిపించిన ప్రియాంక గాంధీ
- విముక్తి కోసం ఫోరం కి మద్దతు : సీపీఐ(ఎం)
- భ్రష్ట్ జనతా పార్టీ : ఉద్ధవ్ ఠాక్రే
- అరెస్టులు ఎందుకు : అఖిలేష్ యాదవ్

# రాంలీలా మైదానం ర్యాలీలో విపక్ష నేతలు



**టి మీడియా, మార్చి 31,న్యూఢిల్లీ :**
ఇండియా ఫోరం ప్రధానంగా ఐదు డిమాండ్లను లేవనెత్తుతోందని ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఇడి, సిబిఐ, ఐటి అధికారులు ప్రతిపక్ష నేతలపై బలవంతంగా చేపట్టిన చర్యలను ఇసి నిలువరించాలని డిమాండ్ చేశారు. హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలని, ప్రతిపక్షాలను ఆర్థికంగా నిర్వీర్యం చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజీపీ సేకరించిన నిధులపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

### మ్యాచ్ ఫిక్సింగ్‌కు యత్నిస్తున్న ప్రధాని మోడీ : రాహుల్ గాంధీ

లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోడీ మ్యాచ్ ఫిక్సింగ్‌కి యత్నిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. కేజ్రీవాల్ ఇడి అరెస్ట్‌కు వ్యతిరేకంగా ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా ఫోరం లోక్‌తంత్ర బచావో (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి) పేరుతో ర్యాలీ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ర్యాలీలో ఎన్నికలను క్రికెట్ మ్యాచ్‌తో పోలుస్తూ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఐపీల్ మ్యాచ్‌ల్లో అంపైర్లపై ఒత్తిడి పెంచి, ప్లేయర్లను కొనుగోలు చేసి.. కెప్టెన్లు మ్యాచ్ గెలుస్తారు. దీన్ని క్రికెట్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ అంటారు. రాజకీయాల్లోకూడా అలాగే.. లోక్ సభ ఎన్నికల్లో ముందు మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతుంది. అంపైర్లు ప్రధాని మోడీని ఎంచుకుంటారు' అని ఎద్దేవా చేశారు. తమ టీం నుండి ఇద్దరు ప్లేయర్లను అరెస్ట్ చేస్తారని, కొంతమంది ధనవంతుల కుట్రతో పేదల నుంచి రాజ్యాంగాన్ని లాక్కోవడానికి ప్రధాని మోడీ మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారని అన్నారు. ఇవిఎంలు, మ్యాచ్ ఫిక్సింగ్, సోషల్ మీడియా, మీడియాపై ఒత్తిడి పెంచడం వంటివి చేయకుండా బిజెపి కనీసం 180 సీట్లు కూడా గెలవలేదని అన్నారు. భారీ మద్దతుతో ఓట్లు వేయకపోతే ఓట్లు వేయకపోతే.. బీజీపీ మ్యాచ్ ఫిక్సింగ్ చేసి గెలుస్తుందని మండిపడ్డారు. వారు విజయం సాధిస్తే.. రాజ్యాంగాన్ని కూడా నాశనం చేస్తారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు.

### విముక్తి కోసం ఫోరం కి మద్దతు : సీపీఐ(ఎం)

నియంతృత్వం నుండి విముక్తి కావాలంటే ఇండియా ఫోరంకు మద్దతు ఇవ్వాలని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరీ పేర్కొన్నారు. అవినీతి, నియంతృత్వం స్వేచ్ఛకోసం ఇండియా ఫోరం సెక్యులర్ ఫ్రంట్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. జుడేగా భారత్, జీతేగా ఇండియా అని నినాదాలు చేశారు.

### 400 సీట్లు గెలిచేటట్లయితే.. అరెస్టులు ఎందుకు : అఖిలేష్ యాదవ్

తాము 400 సీట్లు గెలుస్తామని బీజీపీ నినాదాలు ఇస్తోందని.. నిజంగా 400 సీట్లు గెలిచేటట్లయితే.. కేజ్రీవాల్‌బీ హేమంత్ సోరెన్‌లను ఎందుకు అరెస్ట్ చేశారని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. ఓటుతోనే ఈ దేశాన్ని రక్షించగలరని ప్రజలకు సూచించారు. మీ ఓటు మాత్రమే రాజ్యాంగాన్ని, పిడిఎ (పిడిఎ- వెనుకబడిన, దళిత, మైనార్టీలు) వర్గంలోని 90 శాతం జనాభా రిజర్వేషన్లను కాపాడుతుందని అన్నారు.

### బీజేపీ, ఆరెస్సెస్ పాయిజన్ లాంటి వాళ్లు: ఖర్గే

దేశంలోని అధికార బీజేపీపై, దాని మాతృసంస్థ ఆరెస్సెస్ పై కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ఇండియా కూటమి బహిరంగసభలో ఖర్గే ప్రసంగించారు. దేశంలో బీజేపీ నియంత పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. బీజేపీ, ఆరెస్సెస్ విషం లాంటివని, ఆ విషాన్ని రుచి చూస్తే చచ్చిపోతారని హెచ్చరించారు. అంటే బీజేపీ, ఆరెస్సెస్‌ల పాలన గురించి తెలిసి కూడా మరోసారి ఓటు వేయవద్దనే ఉద్దేశంలో ఆయన మాట్లాడారు.

### భ్రష్ట్ జనతా పార్టీ : ఉద్ధవ్ ఠాక్రే

బీజేపీ అత్యంత అవినీతి పార్టీ అని తేలిందన్నారు శివసేన యూబీటీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే. ఢిల్లీలో విపక్ష ఇండియా కూటమి నిర్వహించిన సేవ్ డెమోక్రసీ మెగా ర్యాలీలో ఆయన ప్రసంగించారు. మోడీ సర్కార్ లక్ష్యంగా విమర్శలను గుప్పించారు ఠాక్రే. బీజేపీ నిజస్వరూపం ప్రజల ముందు బట్టబయలు అయ్యిందని ఆయన అన్నారు. బీజేపీ అత్యంత అవినీతి పార్టీ అని.. బీజేపీ అంటే భ్రష్ట్ జనతా పార్టీ అని మండిపడ్డారు. బీజేపీ 'మోడీ కా పరివార్' ప్రచారంపై విరుచుకుపడ్డారు ఉద్ధవ్ ఠాక్రే. కొవిడ్ సమయంలో తాను సీఎంగా ఉన్నప్పుడు నా కుటుంబం, నా బాధ్యత అని తను సంకల్పించినట్లు తెలిపారు. మీ కుటుంబంలో మీరు, కుర్చీ మాత్రమే ఉన్నాయని మోడీని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు .యం

### సోరెన్, కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలి: ప్రియాంక గాంధీ

ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగిన మెగా ర్యాలీలో విపక్ష నేతలు మోడీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేపడుతోందని ఆరోపించారు. ఇక ఇండియా విపక్ష కూటమి ప్రధానంగా ఐదు డిమాండ్లను లేవనెత్తుతోందని ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈసీ అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులు విపక్ష నేతలపై బలవంతంగా చేపట్టిన చర్యలను ఈసీ నిలువరించాలని డిమాండ్ చేశారు. హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలని, విపక్షాలను ఆర్థికంగా నిర్వీర్యం చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇక ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ సేకరించిన నిధులపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

## రాష్ట్రపతి చేతుల మీదుగా అద్వానీకి భారతరత్న ప్రదానం

### ప్రధాని మోదీ, అమిత్ షా హాజరు



**టి మీడియా, మార్చి 31,న్యూఢిల్లీ :**
భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి ఆదివారం (మార్చి 31) భారతరత్న అందజేశారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. అద్వానీ ఇంట్లో జరిగిన ఈ సత్కారానికి ప్రభుత్వం తరుపున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహా 10 మంది హాజరయ్యారు. హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్నారు. ఈ సమయంలో అద్వానీ కుటుంబం నుంచి 10 మంది కూడా హాజరయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అద్వానీ నివాసానికి చేరుకుని భారతరత్న అవార్డుతో సత్కరించారు. అద్వానీ ఆరోగ్యం, వృద్ధాప్యం వంటి కారణాల వల్ల ఇంట్లో సన్మాన కార్యక్రమం నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు ప్రధాని మోదీ, హెూంమంత్రి అమిత్ షా , జేపీ నడ్డాతో పాటు పలువురు నేతలు కూడా అద్వానీ ఇంటికి చేరుకున్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ సంస్థాగత మంత్రి బీఎల్ సంతోష్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు ఉన్నారు. శనివారం మార్చి 30వ తేదీన రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలోని నలుగురు ప్రముఖులను భారతరత్నతో సత్కరించారు. ఇందులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి జననాయక్ కర్పూరీ ఠాకూర్, దేశ మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్, దేశంలోని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ఉన్నారు. ఈ నలుగురికీ మరణానంతరం దేశ అత్యున్నత పురస్కారం లభించింది. మరణానంతరం ప్రతి ఒక్కరికీ భారతరత్న అవార్డు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో దివంగత కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్ భారతరత్న అవార్డును అందుకున్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా పీవీ ప్రభాకర్ రావు తనయుడు, దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ గౌరవాన్ని అందుకున్నారు. మాజీ ప్రధానిగా, రైతుల దూతగా భావించే చౌదరి చరణ్‌సింగ్‌కు ఇచ్చిన భారతరత్నను ఆయన మనవడు జయంత్ చౌదరి అందుకున్నారు. దేశంలోని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా భారతరత్న అవార్డు లభించింది. రాష్ట్రపతి ముర్ము నుంచి ఆయన కుమార్తె నిత్యారావు ఈ గౌరవాన్ని అందుకున్నారు.





# ఎకరాకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలి

## ఇచ్చేదాకా వేటాడుతాం.. వెంటాడుతాం

- ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీ స్థం
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**టీ మీడియా, మార్చి 31సూర్యాపేట బ్యూరో :**
ఎండిపోయిన పంటలకు ప్రతి ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డిమాండ్ చేశారు. ఈ నష్టపరిహారం ఇచ్చేదాకా వేటాడుతాం.. వెంటాడుతాం.. ధర్నాలు చేస్తామని చెప్పారు. అవసరమైతే ఎక్కడికక్కడ గ్రామాల్లో మీ ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీస్తామని స్పష్టం చేశారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో నీళ్లందక ఎండిపోయిన పంటలను కేసీఆర్ పరిశీలించారు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఒకప్పుడు పంటలు నష్టపోతే కేంద్రానికి నివేదిక పంపించాల్సి ఉండేది.. మూడు నెలల తర్వాత అధికారులు వచ్చి పరిశీలించి.. రిపోర్టు రాయాలి.. అయినా రైతులకు పరిహారం అందే పరిస్థితి ఉండేది కాదని అన్నారు. అందుకే ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ పద్ధతిని మార్చేశా అని తెలిపారు. భయంకరమైన రాళ్ల వాన పడి మహబూబాబాద్, ఖమ్మం, ఇలా చాలా జిల్లాల్లో పంట నష్టం జరిగితే స్వయంగా వెళ్లి పరిశీలించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పుడప్పుడే రైతులు బలపడుతున్నరు కాబట్టి వాళ్ల పరిస్థితి దిగజారవద్దని.. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఎకరానికి 10వేలు నష్టపరిహారం ఇచ్చా అని తెలిపారు. నష్టపోయిన ఆ పొలంలోనే నిల్చుండి ప్రకటించడమే కాకుండా.. ఐదారు రోజుల్లోనే నష్టపరిహారం అందించానని అన్నారు. ఆనాడు దాదాపు 500 కోట్లను రైతులకు అందించామని చెప్పారు. అదే ఇవాళ రాళ్ల వాన పడితే అడిగే దిక్కులేదని మండిపడ్డారు. అకాల వర్షాలు పడి సుమారు లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోతే దాని గురించి మాట్లాడే దిక్కే లేదని అన్నారు. ఓ ఎమ్మెల్యే పోడు.. మంత్రి పోడు.. ముఖ్యమంత్రికి అయితే ఢిల్లీ యాత్రలతోనే సరిపోతుందని ఎద్దేవా చేశారు. ఏదేమైనా సరే.. రణరంగమైనా సరే.. ఈ ప్రభుత్వం మెడలు వంచి పరిహారం ఇప్పిస్తామని చెప్పారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయిన నాడు కూడా 470 కోట్ల బకాయిలు పెట్టిపోతే.. మేం ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని కేసీఆర్ తెలిపారు. అదే ఈనాడు తాము ఏ బకాయిలు పెట్టలేదని అన్నారు. 50 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పరిపాలనలో ఏనాడు ఇవ్వని 10వేలు నష్టపరిహారం అందిస్తే.. ఆనాడు దాన్ని ఎకసెకం చేసి మాట్లాడారని మండిపడ్డారు. 10 వేలు ఏమూల సరిపోద్ది.. 20 వేలు ఇవ్వాలని ఆనాడు కాంగ్రెస్ నాయకులు అన్న మాటలను గుర్తు చేశారు. మరి ఇవాళ ఏడ పడుకున్నరు.. తలకాయ ఏడ పెట్టుకున్నారని నిలదీశారు. గుడ్డి గుర్రాల పళ్లు తోముతున్నరా? వీళ్లు రైతులు కాదా? ప్రజలు కాదా? వీళ్ల గురించి పట్టింపు లేదా? అని మండిపడ్డారు. ప్రజల తరఫున మాట్లాడేటోళ్లు లేరని అనుకుంటున్నారా? ఒక మహాసముద్రం అంత బీఆర్ఎస్ పార్టీ ఉంది.. ఊరుకోదని హెచ్చరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వందకు వంద శాతం రైతుల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పంటలను మీరే ఎండబెట్టిర్రు కాబట్టి.. మీ అసమర్థత వల్లే ఎండిపోయినయి కాబట్టి నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని కేసీఆర్ తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చి ఎన్యుమరేట్ చేయాలని సూచించారు. ఏ జిల్లాల్లో ఏ మండలంలో ఏ గ్రామంలో ఏ రైతు పంట ఎంత ఎండిపోయిందనే లెక్కలు తీయాలని అన్నారు. ధరలు అన్నీ పెరిగినయ్ కాబట్టి.. ఎకరాకు రూ.25వేలు నష్టపరిమారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిహారం ఇచ్చే దాకా వేటాడుతాం.. వెంటాడుతాం.. ధర్నాలు చేస్తామని తెలిపారు. ఎక్కడికక్కడ మీ మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీస్తామని అన్నారు.. ప్రజాస్వామ్యంలో అడిగే హక్కు మాకు ఉంటది కాబట్టి.. ప్రధాన ప్రతిపక్షంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతు మేమే అని తెలిపారు. ' మీరు ఒకర్నో.. ఇద్దర్నో కుక్కల్నో.. నక్కల్నో గుంజుకుని ఓహెూ అహా అని సంకలు గుద్దుకోవచ్చు. అది చిల్లర రాజకీయ స్టంట్. ప్రజల సమస్యల ముందు, ప్రజల బాధ ముందు.. ఎండిపోయిన పంటల ముందు చిల్లర రాజకీయాలు చేయడం కాదు ' అని అన్నారు. ఎండిన ప్రతి ఎకరాన్ని మీరు ఎన్యుమరేట్ చేయించాలని సూచించారు

## పోలీసులపై గిరిజన వర్గాల మధ్య పోడు వివాదం

# పోలీసులపై కర్రలతో దాడి



**టి మీడియా, మార్చి 31,సత్తుపల్లి:**
పోడు భూముల వివాదంలో పోలీసులని ఉరికిచ్చి కొట్టిన ఘటన ఖమ్మం జిల్లాలో జరిగింది. సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామ శివారు లోని చంద్రాయపాలెం గ్రామంలో పోడు భూముల వ్యవహారంలో అక్కడ ఉన్న రెండు గిరిజన వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో గిరిజనుల మధ్య జరుగుతున్న ఘర్షణను ఆపేందుకు సత్తుపల్లి నుంచి పోలీసులు చేరుకున్నారు. సత్తుపల్లి సిఐ కిరణ్ ఆధ్వర్యంలో సమస్యని పరిష్కరించడం కోసం ఇరువర్గాలని సమన్వయ పరచడానికి ప్రయత్నం చేశారు. ఈ సమన్వయ పరిచే సందర్భంగా గిరిజనుల్లో ఒక వర్గం కర్రలు తీసుకొని పోలీసులపై దాడికి పాల్పడింది. అటవీ ప్రాంతంలోనే గిరిజనులు పెద్ద పెద్ద కర్రలతో సీఐతో పాటు వున్న పోలీసుల అక్కడి నుంచి ఉరికించారు. అంతేకాకుండా.. వారిపై దాడికి పాల్పడ్డారు. దీంతో కొంతమంది పోలీసులు అక్కడి నుంచి వెళ్ళిపోతుండగా వారి వెంటపడి గిరిజనులు తరుముకుంటూ వెళ్లారు. పెద్ద పెద్ద కర్రలతో గిరిజనులు ఒక్కసారిగా పోలీసుల మీద పడటంతో పోలీసులు పరుగులు పెట్టారు. గిరజనులకు ఎంత చెప్పినా వినకపోవడంతో.. ఇక పోలీసులు కూడా చేతులెత్తేసారు.. అక్కడి నుంచి పరుగులు పెడుతూ వచ్చారు. వారి మోటార్ బైక్ పై ఎక్కి వెళ్ళిపోతున్న పోలీసులు సివిల్ డ్రెస్ లో ఉన్న పోలీసులపై కూడా వెంట తరిమి వారిపై కూడా దాడి చేశారు. దీంతో ఏమీ చేయలేని పరిస్థితిలో పోలీసులు మోటార్ బైక్ నుంచి దిగి వారిని గిరిజనులని బ్రతిమిలాడు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు గిరిజన వర్గాల మధ్య ఉన్న విభేదాన్ని పరిష్కరించడానికి వెళ్లిన పోలీసులుకి గిరిజనుల దాడిలో తీవ్ర గాయాలు అయ్యాయి. అయితే అసలు పోడు భూముల విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం ఎందుకు తలెత్తింది అనేదానిపై ఆరా తీస్తున్నారు. వారి సమస్యలను తెలుసుకునే లోపే ఇరువర్గాలు ఇలా దాడి చేయడంపై దర్యాప్తు సిద్ధమయ్యారు పోలీసులు.

## ఆర్కెపి సిఎస్పీ లో ఒకేరోజు 28 వేల టన్నుల బొగ్గు రవాణా

**- జిఎం మనోహర్**




**టీ మీడియా, మార్చి 31, రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని సిఎస్పి 1977 లో ఆరంభమై 47 సంవత్సరాలు నిండిన ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడు ఒకేరోజు ఏడు రేకుల బొగ్గు రవాణా జరగలేదు. మందమర్రి ఏరియాకు ఒక కళ వచ్చినట్టుగా మనోహర్ జిఎం వచ్చిన 16 సంవత్సరాలకు మందమర్రి ఏరియా వార్షిక లక్ష్యాన్ని ఈ ఆర్థిక సంవత్సరం లో చేరుకోవడం జరిగింది. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో ఉపరితల గనులను ఉరకలెత్తించి ఒకేరోజు 28వేల టన్నుల బొగ్గు రవాణా శనివారం ఏడు రేకులను ఎటువంటి ఇబ్బందిలేకుండా సునాయసంగా చేయడం జరిగింది. ఆర్కెపి సి ఎస్పీ నిర్దేశించిన 22 లక్షల బొగ్గు రవాణాకు గాను దాదాపు 31 లక్షల బొగ్గు రవాణా చేసినందుకు జిఎం సిఎస్పీ కార్మికులను,అధికారులను అభినందించారు.సిఎస్పీ ఇంఛార్జ్ బాలాజీ భగవతి ఝా మాట్లాడుతూ మా ఏరియా ఇంజనీర్ నాగరాజు, సహకరించిన తోటి ఇంజనీర్స్ ఛంద్రమౌళి,అశోక్ రెడ్డి, సంతోష్ టీం సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియచేసారు.

## నవోదయ కు ఎంపికైన శ్రీ భాస్కర విద్యానికేతన్ విద్యార్థులు

**టీ మీడియా, మార్చి 31, చింతూరు :** జవహర్ నవోదయ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ ఫలితాల్లో అల్లూరి జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలోని శ్రీ భాస్కర విధ్యా నికేతన్ ప్రైవేటు స్కూల్‌కు చెందిన నలుగురు చింతూరుకు చెందిన విద్యార్థులు ఎంపికైయ్యారు. ఎంపికైన వారిలో నీలాపు ప్రణయ్ కార్తిక్ రెడ్డి,రవ్వ రిత్విక్, మడకం కార్తికేయ, చిరసాని కిరాక్ వేదాన్ష్ ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. శ్రీ భాస్కర విధ్యానికేతన్ కరస్పాండెంట్ వేణు గోపాల్ సార్, ప్రిన్సిపాల్ అలీ పాష, తరగతి ఉపాధ్యాయిలు ప్రోత్సాహంతో ప్రతిభ కలిగిన మా పిల్లలు సీటు సాధించగలిగారని తెలిపారు. ఈ సందర్భముగా స్కూల్ యాజమాన్యం వారు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.






## కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, కావ్య



**టి మీడియా, మార్చి 31,హైదరాబాద్:**
బీఆర్ఎస్ స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వీరికి కండువాకప్పి పార్టీలోకి ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ ఆహ్వానించారు. అయితే కడియం కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్‌ను గులాబీ బాస్ కేటాయించగా.. ఆమె పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు కేసీఆర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న తన కూతురిని ఓడిపోయే పార్టీ తరఫున పోటీ చేయించదలుచుకోలేదని కడియం శ్రీహరి ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు.

# ఓట్ల కోసం ఈ ర్యాలీ చేపట్టడం లేదు : సునీత కేజ్రీవాల్

**టి మీడియా, మార్చి 31,న్యూఢిల్లీ :**
ఓట్ల కోసం ఈ ర్యాలీ చేపట్టడం లేదనిఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ భార్య సునీత పేర్కొన్నారు. తన భర్తను మోడీ ప్రభుత్వం అరెస్ట్ చేసిందని, అయితే కేజ్రీవాల్ ఎక్కువ కాలం జైలులో ఉండరని న్యాయం గెలిచి తీరుతుందని ఆమె పేర్కొన్నారు. తన భర్త దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడి లాంటి వాడని అన్నారు. కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా ఫోరం భారీ ర్యాలీకి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ భారీ ర్యాలీలో కూటమిలోని 29 పార్టీలు పాల్గొననున్నాయి. ఈ ర్యాలీలో పాల్గొన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ భార్య సునీత ఆయన సందేశాన్ని చదివి వినిపించారు. "నేను ఓట్లు అడిగేందుకు ఇక్కడికి రాలేదు. నేను జైలులో ఉన్నాను. ఆలోచించుకునేందుకు చాలా సమయం ఇచ్చింది. ఈ రోజు భారత మాత బాధలో ఉంది" అని సునీత కేజ్రీవాల్ సందేశాన్ని చదివి వినిపించారు. " నవ భారతాన్ని నిర్మిద్దాం. ప్రతి వ్యక్తికి, ఉపాధి , మంచి విద్య , అందరికీ అందుబాటులో ఆరోగ్య భద్రత కల్పిస్తామని అన్నారు. ద్వేషం లేని దేశం, న్యాయం అందరికీ సమానంగా అమలయ్యే దేశాన్నీ నిర్మించాలి" అని పేర్కొన్నారు.



తన ఇద్దరు సోదరీ మణులు కల్పన, సునీతలకు మద్దతుగా నిలిచేందుకు ఇక్కడి వచ్చానని, ఇది ప్రచార ర్యాలీ కాదని శివసేన (యుబిటి) నేత ఉద్ధవ్‌థాకరే పేర్కొన్నారు. నియంతృత్వ బిజెపి ప్రభుత్వం వారి భర్తలను అక్రమంగా జైలులో పెట్టిందని, వారికి దేశం యావత్తు మద్దతుగా నిలుస్తుందని చెప్పేందుకు ఇక్కడికి వచ్చానని అన్నారు. ఇడి, ఐటి, సిబిఐ బిజెపి భాగస్వామ్యులని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు సమయం ఆసన్నమైందని అన్నారు. అధికార పార్టీ వాషింగ్ మెషీన్ వంటిదని, వారి పార్టీలో చేరిన తర్వాత అవినీతి పరులు కూడా క్లీన్‌గా మారతారని ఎద్దేవా చేశారు. రైతులు కూడా ర్యాలీలో పాల్గొనాలని భావించారని, అయితే వారికి బిజెపి ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని అన్నారు. రైతులను తీవ్రవాదులుగా అభివర్ణించే ప్రభుత్వం పోవాలని, కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. నియంతృత్వ, మతతత్వ బిజెపి పార్టీ విధానాలను ఎండకట్టేందుకు, అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ అరెస్ట్‌కు వ్యతిరేకంగా రాంలీలా మైదానంలో మహా ర్యాలీలో ప్రజలు. నేతలు పాల్గంటున్నారని సిపిఎం నేత బృందాకరత్ పేర్కొన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఉపా చట్టాన్ని ఇడి, సిబిఐ దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని మండి పడ్డారు. ఈ ప్రభుత్వం సమర్థమంతమైనది కాదనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. రాజ్యాంగం దాడికి గురవుతోందని కాంగెస్ నేత సుప్రియా శ్రీనతే అన్నారు. రాంలీలా మైదనంలోని మెగా ర్యాలీ వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. ' రాజ్యాంగం దాడికి గురవుతోంది. దేశం మొత్తం రాజ్యాంగ రక్షణకు కలిసికట్టుగా ముందుకువెళ్తోంది. ఇదే విషయాన్ని విషయాన్ని తెలియజేయటానికి ర్యాలీకి హాజరవుతున్నా' అని అన్నారు.

### ఢిల్లీ ప్రజల కోసమే కేజ్రీవాల్ ఆందోళన..

రాంలీలా మైదనం వద్దకు నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారని ఢిల్లీ మంత్రి ఆతిషీ అన్నారు. ఆమె మీడియా మాట్లాడుతూ.. సిఎం కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజల జీవితాలను మార్చారని వారికి తెలుసు. ఆయన అరెస్ట్ అయ్యాక కూడా ఢిల్లీ ప్రజల కోసం ఆందోళన పడుతున్నారు' అని మంత్రి పేర్కొన్నారు.



## అన్నదాతలను ఆదుకోవాలి

### ఎంపీ నామ నాగేశ్వరరావు డిమాండ్

**టి మీడియా, మార్చి 31,ఖమ్మం :**
ప్రభుత్వ వైఫల్యంతో తీరని గోస పడుతూ పంటలు ఎండిపోయి కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాతలను తక్షణమే ఆదుకోవాలని ఖమ్మం బీఆర్ ఎస్ అభ్యర్థి ఎంపీ నామ నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు తో కలిసి ఆదివారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో నామ మాట్లాడారు. కేవలం నాలుగు నెలల కాలంలోనే ప్రజల , రైతుల గోస, కన్నీటి కష్టాలు చే ప్పనవికాకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాగు, సాగు నీరు లేక ప్రజలు పడరాని కష్టాలు పడుతున్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదన్నారు. తక్షణమే ఎకరాకు రూ.30 వేలు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేసీఆర్ కు అండగా ఉండి, పార్లమెంట్ ఎన్నికల్లో తనని గెలిపించాలని నామ కోరారు. విలేకరుల సమావేశంలో ఇంకా లింగాల కమలరాజు, శ్రీయుతులు సండ్ర వెంకట వీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు,కోనేరు చిన్ని, కూరకుల నాగభూషణం, మేయర్ నీరజ, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం ఆదివాసీ భవన నిర్మాణం పూర్తి చేసి చూపిస్తాం

- అశ్వాపురం ఆదివాసీ జేఏసీ నూతన కమిటీ ఎన్నికను విజయవంతం చెయ్యాలి
- ప్రతి పల్లెకు ఆదివాసీ కమిటీ నిర్మాణం చేపట్టుటకై అందరూ సంసిద్ధం కావాలి
- జేఏసీ

**టీ మీడియా, మార్చి 31, అశ్వాపురం :**
ఆదివారం అశ్వాపురంలో ఆదివాసీ జాక్ పిలుపుమేరకు ఆదివాసీ భవన్ వేదికగా ఆదివాసీ జెఏసి అధ్యక్షులు కుంజా రామారావు ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం విజయవంతంగా నిర్వహించారు. విచ్చేసిన ఆదివాసీ సీనియర్ నాయకులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ ఉద్యోగ సంఘలవారు, యువత అందరు కలిసి మాట్లాడుతూ.. ఆదివాసీ భవన నిర్మాణంపై చర్చించి త్వరలోనే నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ చట్టాలకు భద్రత చేపట్టాలని జాతి మనుగడను అభివృద్ధి మరియు సంస్కృతి సంప్రదాయాలకు అశ్వాపురం ఆదివాసీ జాక్ కమిటీ జిల్లాలోని ఆడివాసులకు ఆదర్శప్రాయం కావాలని ఆ మార్గానికి యువత ముందుకు వచ్చేలా ప్రతి గ్రామానికి గ్రామకమిటీలను త్వరలోనే నిర్మించాలని యువతకు ఆదివాసీ చట్టాలు, పెసా సిదాంతాలు విది విధానాలను తెలిపేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ అధ్యక్షులు కుంజా రామారావు, మాజీ అధ్యక్షులు పోడియం. అనిల్, తుడుందెబ్బ జిల్లా నాయకులు తంగేళ్ల భద్రయ్య,ఆదివాసీ సీనియర్ నాయకులు బొడిక. వెంకటేశ్వర్లు, కుంజ. రామరావు, బట్టా సత్యనారాయణ, బీజేపీ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పోడియం.బాలరాజు, మాజీ ఎమ్మెల్యే కుంజ భిక్షం కుమారుడు కుంజ అనిల్, ఆదివాసీ యువత తోకల చంద్రశేఖర్, సపక నరేష్ కల్లూరి నరసింహారావు, కోరేం రామారావు తెల్లం శ్రీను, ఇర్ప లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలోకి వస్తే 9 గ్యారంటీ పథకాలు అమలు

**టి మీడియా, మార్చి 31,వేంపల్లె :**



ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 9 గ్యారంటీ పథకాలను అమలు చేయడం జరుగుతుందని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో 5 గ్యారెంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా తెలంగాణలో 6 గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని చెప్పారు. అదేవిధంగా 9 గ్యారెంటీ పథకాలతో ఆంధ్ర ప్రదేశ్ లో కూడ కాంగ్రెస్ అధికారం లోకి రాబోతుందని తులసిరెడ్డి జోస్యం చెప్పారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం క్రింద ప్రతి పేద కుటుంబం లో ఒక మహిళకు ఏడాదికి లక్ష రూపాయల ఆర్థిక సాయం చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు రెండు లక్షల రూపాయల వరకు వ్యవసాయ రుణాల మాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో కనీస మద్దతు ధర కల్పిస్తామని చెప్పారు. అలాగే 10 సంవత్సరాల పాటు ప్రత్యేక హెూదా అమలు చేస్తామని తెలిపారు. ఇల్లు లేనివారికి రు 5 లక్షలతో ఇల్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని తెలిపారు. వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ 4 వేలు, వికలాంగులకు నెలకు రూ 6 వేలు పెన్షన్ అందిస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం క్రింద కనీస కూలి రోజుకు రూ 400 వచ్చే విధంగా చర్యలు తీసుకొంటామని చెప్పారు. 2 లక్షల 25 వేల ప్రభుత్వ ఉద్యోగాల ను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను తీర్చడం జరిగుతుందని తెలిపారు. కాంగ్రెసు పార్టీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో అమలు కావాలంటే కాంగ్రెస్ అధికారం లోకి రావాలని కాబట్టి ప్రతి ఒక్కరూ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసిరెడ్డి ప్రజలను కోరారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని బలపరచాలని కోరారు.



### సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్

**టీ మీడియా, మార్చి 31, గోదావరిఖని:**
రామగుండం కార్పొరేషన్ పరిధి 33వ డివిజన్ కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్సిటిజన్స్ మహిళలు కొబ్బరికాయలు కొట్టిరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక క్షేత్రంలో కార్మిక కుటుంబాలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ ఆదేశానుసారం సింగరేణి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నో సంవత్సరాల క్రితం వేసినటువంటి రోడ్ల శిథిలావస్థకు రావడంతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించాలని, సింగరేణి అధికారులకు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఆర్ జీవన్ జీఎం చింతల శ్రీనివాస్ స్పందించి ఉన్నత అధికారులకు శాంక్షన్ చేసిన అనంతరం డివిజన్ ప్రజలకు, కార్మిక కుటుంబాలకు ముమ్మందు రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ సహాయ సహకారాలతో అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే ముందుకు సాగుతామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ డివిజన్ మహిళలు, యువకులు, సీనియర్ సిటిజన్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### హెూరేబ్ హెూలీ చర్చి లో ఈస్టర్ వేడుకలో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

**టీ మీడియా, మార్చి 31, అమీన్ పూర్ :**
అమీన్ పూర్ మున్సిపాలిటీ మల్లికార్జున హిల్స్ కాలనీ హెూరేబ్ హెూలీ చర్చిలో ఈస్టర్ వేడుకలో పాల్గొన్న పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ.. స్వార్థం కుట్ర, హింసా ద్వేషాలు ఎప్పటికి గెలుపు సాధించలేవని క్రీస్తు పునరుద్దానం మనకు చెబుతుంది. ఈస్టర్ మహూదయ స్ఫూర్తితో ప్రేమ,శాంతితో కూడిన నవ సమాజ స్థాపనకు కృషి చేద్దాం అన్నారు.

### రామగిరిఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

**టీ మీడియా, మార్చి 31, గోదావరిఖని:**



పెద్దపల్లి జిల్లా లోని రామగిరి కిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, ఆదివారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంట సత్యనారాయణ రెడ్డి కోరారు. అలాగే జిల్లాలోని అన్ని దేవాలయాలను అఖిలపక్షం కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు విడుదల చేసి నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని ప్రకటనలో కోరారు.



### అహెూబిల స్వామి వారి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన

**టి మీడియా, మార్చి 31, మేళ్ళ చెరువు :**
మై హెూమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీనగర్ కాలనీ నందు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజన్ స్వామి వారి మంగళాశాసనములతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి 26 వ బ్రహ్మోత్సవములలో భాగముగా మూడవ రోజు శ్రీ శ్రీ శ్రీ అహెూబిల స్వామి వారి సమక్షంలో లక్ష కుంకుమార్చన, ఎదురుకోలు, హనుమద్వాహనన కార్యక్రమములు జరిగినవి. ఈ కార్యక్రమము లలో మై హెూమ్ ఇండస్ట్రీస్ గ్రూప్ చైర్మన్ దంపతులు జూపల్లి రామేశ్వర్ రావు, శ్రీ కుమారి సంస్థ ప్రతినిధులు మునగాల రామ్మోహన్ రావు, అరుణ దంపతులు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, అనురాధ దంపతులు, తెలంగాణా రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి. రాజ గోపాల్ దంపతులు, భక్తులు, ఉద్యగులు పాల్గొన్నారు.

## పార్టీ ఏదైనా కష్టపడ్డ కార్యకర్తలకు న్యాయం చెయ్యాలి

- దయానంద్ ముదిరాజ్

**టీ మీడియా, మార్చి 31, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ ప్రమాణాల గురించి వనపర్తి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే దయానంద్ ముదిరాజ్ స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పార్టీ గెలవాళ్లన్న కార్యకర్తల కష్టం, కృషి, త్యాగం ఖచ్చితంగా ఉంటుంది అన్నారు. గెలిచినా తరువాత వచ్చే వారి కంటే ఓడినప్పుడు భుజం తట్టి ప్రోత్సహించిన వారు ముఖ్యం అన్నారు. కొందరు పెద్దలు ప్రముఖ వ్యక్తుల ఉన్నత స్థానం కోసం నూతన వ్యక్తులను పార్టీలకు ఆహ్వానిస్తున్నాం అ%శీ%టున్నారు. కానీ వారి రాజకీయ పరిజ్ఞానం తో మాట్లాడుతున్నారు. ఏ పార్టీ గెలిచిన వ్యక్తులు ఒక్కటే అన్నట్లుగా అవుతుంది. నూతన వ్యక్తులకు, యువకులకు అవకాశాలు ఇవ్వండి. గెలుపు పొందే నాయకులు ఎలాగైనా గెలుస్తారు. వీలైనంత వరకు గెలిచినా నాయకులు వారికి కార్యకర్తలకు సహకరించాలి. ఏ పార్టీ గెలిచినా కార్యకర్త కుటుంబ ఆర్థిక పరిస్థితి మారడం లేదు. కేవలం జేండాలు మోసి ప్రజలను సమీకరించడానికే అవుతుది. కోత్త తరానికి సామాన్య ప్రజలకు స్వాగతం పలకడం ప్రోత్సహించడం చాలా ముఖ్యం అన్నారు.. మేము చూసాము 2023 ఎన్నికలలో ప్రతి కార్యకర్త కష్టం ఖద్దర్ బట్టలు కార్లు ఒకవైపు మాసిన బట్టలు అరిగిన చెప్పులు ఒకవైపుగా చేసిన యుద్ధంలో మాసిన బట్టలు సామాన్య ప్రజలు గెలిచారని భావించాం కానీ మళ్ళీ ఖద్దర్ బట్టలు వివిధ కారణాలతో ప్రక్క బాటలు వేస్తున్నాయి. పెద్దలు ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని తెలిపారు.

## సునీత కేజ్రీవాల్‌తో సమావేశమైన కల్పనా సోరెన్

**టి మీడియా, మార్చి 31,న్యూఢిల్లీ :**



జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్‌ను కలుసుకున్నారు. శనివారం 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో ఆమెను కలుసుకున్నారు. వీరిద్దరు సుమారు 15-20 నిమిషాల పాటు సమావేశం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కల్పనా సోరెన్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం జార?ండ్‌లో జరిగిన ఘటన మాదిరిగానే ఢిల్లీలో కూడా జరిగిందని అన్నారు.జార?ండ్‌లో భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జనవరిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నారు.తాను సునీతను కలుసుకునేందుకు వచ్చానని, ఆమె భాధ్యతలను కూడా పంచుకుంటానని అన్నారు. తాము ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతిజ్ఞ చేశామని కల్పనా సోరెన్ చెప్పారు. జార?ండ్ రాష్ట్రం అరవింద్ కేజ్రీవాల్ వెంట ఉంటుందని, తాను కాంగ్రెస్ పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీని కలవబోతున్నానన్నారు. రాంలీలా మైదాన్‌లో జరిగే ఇండియా కూటమి బహిరంగ సభకు హాజరవుతానన్నారు.ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ భారీ బహిరంగ సభకు ఇండియా ఫోరం పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

## బిజెపి అభ్యర్ధిని భారీ మెజార్టీతో గెలిపించండి

**టీ మీడియా, మార్చి 31, గోదావరిఖని:**



పెద్దపెల్లి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి గోమాస శ్రీనివాసును భారీ మెజారిటీతో గెలిపించాలని బిజెపి మహిళా నాయకురాలు కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఆదివారం రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖని పీజీ కాలేజ్ గ్రౌండ్ లో వాకర్సును కలిసి బిజెపికి ఓటు వేసి గెలిపించాలని, కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ పెద్దపెల్లి నియోజకవర్గం నుండి నేతకాని సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ కు బిజెపి అభ్యర్థిగా అవకాశం ఇచ్చిందని దళిత, రైతుల పక్షపాతిగా ఉంటూ ప్రజా సంక్షేమానికి బిజెపి కృషి చేస్తుందన్నారు. బిజెపి చేసిన అభివృద్ధిని ప్రజా సంక్షేమాలను చూసి మరొకసారి బిజెపికి అధికారం ఇవ్వాలని ప్రజలను వాకర్సును కోరారు. గత ప్రభుత్వాల పాలన కంటే పదేళ్లలో నరేంద్ర మోడీ పాలన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి మరో అవకాశం కల్పించాలని ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని నరేంద్ర మోడీ 10 ఏళ్లలో చేశారని అన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని ఎన్నో సంస్కరణలని నూతన అధ్యాయాలని భారతీయ జనతా పార్టీ చేసి చూపెట్టడం జరిగిందన్నారు. ఆర్టికల్ 370, రామ మందిర నిర్మాణం, మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించడం లాంటి అనేక సంస్కరణలను చేపట్టారన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ లోని రామగుండం నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా ఈ ప్రాంతం మేధావి వర్గం యువకులు, రైతులు, కార్మికులు, అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కుమారస్వామి, రామన్న,రాజు, సంజీవ్, శ్యామ్ పటేల్,బండారి, నరసింహ రెడ్డి, మహేష్,హర్ష, తిరుపతి, కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### కోల్ ఇండియా కబడ్డీ పోటీలకు ఆర్జీ1 క్రీడాకారులు

**టీ మీడియా, మార్చి 31, గోదావరిఖని టౌన్ :**



కోల్ ఇండియా కబడ్డీ పోటీలకు ఆర్జీ1 క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీలు ఏప్రిల్ 4, 5, 6న ఉత్తరప్రదేశ్ లో జరుగనున్నాయి. సింగరేణి జట్టు కు ఆర్జీ1 కు చెందిన క్రీడాకారులు బేబీ శ్రీనివాస్, సాయికుమార్, బుద్ధ శ్రీనివాస్, మీస హరీష్ లు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్,ఏరియా జిఎం చింతల శ్రీనివాస్ లు క్రీడాకారులను అభినందించారు.కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల్లో సింగరేణి కి మంచి పేరు తీసుకురావాలని కోరారు.



### రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : కొప్పుల ఈశ్వర్

**టీ మీడియా, మార్చి 31,పెద్దపల్లి బ్యూరో:**
రాష్ట్రంలో సాగు నీరు లేక పంటలు ఎండిపోయినరైతులను ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకోవాలని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.పాలనపై అవగాహన లేక పంటలకు నీళ్లు అందించకపోవడంతో పంటలు ఎండి రైతులు అప్పుల పాలవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే రైతులను ఆదుకో వాలన్నా రు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష, తదితరులు ఉన్నారు.

### పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న చిన్నారెడ్డి

- ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, మార్చి 31, వనపర్తి బ్యూరో :**
ఖిల్లా గణపురం మండలం మానజీపేట రవీందర్ రెడ్డి కుమారుడి పుట్టినరోజు వేడుకలో పాల్గొని ఆ బాబు కేక్ తినిపించిన ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి కేక్ ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్, డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎం దేవన్న యాదవ్, జిల్లెల ప్రవీణ్ కుమార్ రెడ్డి, రోహిత్, మత్స్యకార కమిటీ ఉపాధ్యక్షుడు నరేందర్, అక్షయ్, రామేశ్వర్ రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు కే బాల్ రెడ్డి, మామిళ్ళ అనిల్ కుమార్ యాదవ్, సయ్యద్ హైమద్, లక్ష్మణ్ తదితర కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

